యూనిట్ II

# 7. "ససేమిరా"

– కొఱవి గోపరాజు

## చదవండి - ఆలోచించండి - చెప్పండి

ఒక అడవిలో వేటగాడు వేటకోసం వచ్చి చెట్లను, పొదలను తొలగిస్తున్నాడు. ఆ పొదల్లోంచి ఒక పాము బయటకు వచ్చి చెట్లను నరకవద్దు నీకు సహాయం చేస్తానని చెప్పి ఒక రత్నం ఇచ్చింది. దాన్ని అతడు ఎక్కువ ధరకు అమ్మి ధనవంతుడయ్యాడు. చేసిన మేలు మరచి అతడు పాముకు ఇన్ని మణులెక్కడివని ఆలోచించి పుట్టను కనుక్కొని అందులో ఎండు గడ్డి వేసి మంట పెట్టాడు. ఆ మంటలకు పాము చనిపోయింది. మణుల కోసం పుట్టను తవ్వుతుండగా మిగతా పాములు కరచి అతడు చనిపోయాడు. 'కృతజ్ఞత' లేని నరుడు క్రూరమైన వాడు కదా!

### ప్రశ్నలు

1. చెట్లను నరక వద్దని పాము అనడానికి కారణమేమిటి?
2. వేటగాడు పామును ఎందుకు చంపాడు?
3. వేటగాడి స్వభావం ఎలాంటిది? ఇలాంటిదే మరో కథ తెలుసా మీకు?

### నేపథ్యం

విజయపాలుడనే రాజకుమారుడు గుర్రంపై వేటకు వెళ్ళాడు. ఒక దట్టమైన ఆడవిలో దారి తప్పి తిరుగుతుండగా అతనికి దాహం వేసింది. దగ్గరలో ఒక మడుగు కనిపించింది. దగ్గరకు వెళ్ళి మడుగు పక్కనే గుర్రాన్ని కట్టివేసి నీళ్ళు తాగాడు. విశ్రాంతి తీసుకుందామని పక్కనే ఉన్న చెట్టు కిందికి వెళ్ళాడు.

ఈ పాఠ్యాంశం కొఱవి గోపరాజురాసిన "సింహాసన ద్వాత్రింశిక" ప్రథమాశ్వాసం లోనిది.

### విద్యార్థులకు సూచనలు

1. పాఠం చదవండి. తెలియని పదాలకు అర్థాలను తెలుసుకోండి.
2. చిత్రాలను చూసి, సందర్భాన్ని అనుసరించి, ఆలోచించి భావాన్ని గ్రహించండి.
3. పాఠంలో తెలియని విషయాలు గాని, తెలుసుకోవలసిన అంశాలు గాని మీ ఉపాధ్యాయుడితో చర్చించండి, తెలుసుకోండి.

© SCERT not to be republished

*శా. శీఘ్రపాత నితాంతతాంత తురగ స్వేదంబుఁ దీర్పంగ హృ
ష్టాఘ్రాణంబున మోరయెత్తి తనమీస ల్నిక్కఁ దత్సౌరభం
బాఘ్రాణించి చరించి పొంచి కృతముఖ్యాయామభీమాకృతిన్
వ్యాఘ్రం బొక్కటి వచ్చి యచ్చట నృపవ్యాఘ్రాత్మజుం జూచుడున్॥ 1

ఆ.వె. హయము దాని రాక కదరి కట్టిన వాఁగెఁ
ద్రెంచుకొనుచుఁ బాఱె దిక్కులద్రువఁ
బొరిగొనం దలంచు పులిజూచి బెగ్గిలి
విజయపాలుఁ డొక్క వృక్షమెక్కె 2

ఉ. అమ్మెయి నెక్కఁ గోపమున నా పులియుం బఱతెంచి తత్ప్రదే
శమ్మున నిల్చినన్బెగడి శాఖల మీఁదికి డాఁగ నేగియుం
గొమ్మను నొక్క బొల్లియెలుఁగుం గని తల్లడమంది దుర్నిమి
త్తమ్ముగ నా ఫలంబు లిటఁ దప్పక వచ్చెనె దైవమా యనున్ 3

కం. క్రిందఁ బులి మీఁద నెలుఁగును
నంద ప్రియ నందనుండు నడుమం గలుగ
న్మందట నొక నుయ్యియు వెను
కందగ నొక గొయ్యి భంగిఁ గానఁగనయ్యెన్॥ 4

> **సాలభంజిక**
> కర్ర లేదా దంతం లేదా వస్త్రంతో తయారు చేసిన బొమ్మ.

వ. అప్పుడు

ఆ.వె. రెండు నిలువు లెగయుఁ బుండరీకం బిది
నీకు నచట నుండ నేర్పుగాదు
నమ్మి వేగమిటకు రమ్ము బాలక యని
యెలుఁగు పిలిచెఁ గాఱుటెలుఁగు సెలఁగ 5


*ఉ. అక్కొమరుండు దాఁప హృదయంబు యథావిధి నిల్పి రెంటిలో
నిక్కడఁ గొంత యాస గల దిప్పటి కేగెద నంచు మీఁదికిన్
స్రుక్కుచుఁ బోయెఁ గ్రిందఁ బులి చూచి చలంబున మీరలిద్దఱుం
జిక్కితి రంచు నాఁగి నిలిచెం దన కన్నుల నిప్పు లొల్కఁగన్ 6

వ. అప్పుడు ఎలుగుబంటి రాజకుమారునితో ఇట్లు పలికెను.

క. నిద్ర చనుదెంచె నేనియు
నిద్రింపుము వెఱవ నేల నీకిట ననినన్
నిద్ర సుఖ మెఱుఁగ దనఁగా
నిద్రించెఁ దదంకశయ్య నృపసుతుఁడంతన్ 7

© SCERT not to be republished

సీ. శార్దూల మటు చూచి నిర్దయత్వముతోడ
భల్లూక! పగపట్టి బ్రదుకఁ గలవె
వాఁడు నీకే లెస్సవాఁడయ్యెఁ బరజాతి
నృపతిపుత్రుండు నిష్కృపుఁడు వీఁడు
మన కులం బాదిగా వనగోచరంబుల
వేఁటచాటున నొక్క నూటిఁ జంపె
నిల నొక్క గూఁటిఁ పిల్లల మిద్దఱము దుష్ట
బాలునకై పోరనేల మనము
ఆ.వె. వీనిఁ గ్రింద వైపు విడిచి పెట్టెద నిన్ను
సగము నీకు నిత్తు నగవు గాదు
నరుని నమ్మవలదు నమ్మి మున్నొక పాము
చిచ్చులోనఁ గాలి చచ్చెఁగాదె. 8
(అని పలికిన పులి మాటలకు ఎలుగు ఇలా అన్నది.)
*క. గోదానము ధనదానము
భూదానము నన్నదానమును బధికహితాం
భోదానము నుత్తమ వి
ద్యాదానము గూడ నభయదానము సరియే? 9
ఆ.వె. వెన్ను సొచ్చువానిఁ దన్ను నమ్మిన వాని
జంపిరేని శిశువు జంపుటంద్రు
పంత మెఱుఁగు జాంబవంతునివారము
బాస తప్ప మిట్టి యాస విడువు 10
చ. అనుచు నిరుత్తరంబుగ దయామతిఁ బల్కెడు నంత రాజనం
దనుఁడును లేచినన్ క్షణము దానిఁకఁ గూర్కెద నిద్రవోకు మీ
యని తొడమీఁద నూఁదికొని యాయెలుఁగించుక కన్నుమూయఁగాఁ
గని పులి వల్కె వాని మెయిఁ గంపము పుట్టఁగ భీతువెట్టుచున్ 11





©SCERT not to be republished

*ఆ.వె. కోఱలు గలవాని గోళులు గలవానిఁ
గొమ్ములు గలవాని నమ్మవలదు
బమ్మరించెనేని బ్రతుకంగ వచ్చునే
యెలుఁగు తోడి చెలిమి యేల నీకు 12

ఆ.వె. దానిఁ జెప్పనేల యేనిదె యొకయేఁడు
పట్టు నాఱు నెలలు పట్టుఁగాక
మిమ్ముఁ జంపితిందు నమ్ముమీ యెడనాకు
దీనిఁ ద్రోచి బ్రదుకు తెరువు గనుము 13

చ. అనవుడు వాఁడు నిక్కముగ నాత్మఁదలంచి యెలుంగుఁ గూలఁద్రో
చిన నది జాఱుచుం దెలిసి చేతికి లోనగు కొమ్మవట్టి యొ
య్యనఁ బఱతెంచి బెగ్గిలు నృపాత్మజుఁ గన్గొని యల్పబుద్ధివే
మన నను నమ్ముమంటి భయమందకుమీ యని పల్కుచుండఁగన్ 14

ఆ.వె. తమము తోడఁ గూడఁ దరలి శార్దూలంబు
శైలగుహల కేగెఁ జాల డస్సి
తరణి కిరణపంక్తి సరసఁ జెట్టున నుండి
యెలుఁగుఁ గూడి బాలుఁ డిలకు డిగ్గె 15

క. ఆ యెలుఁ గతనిఁ బిలిచి య
న్యాయివి పరలోక పీడనంబగు దురితం
బీయెడన పాయఁ జేసెద
రా యిట వినుమిఁక 'ససేమిరా' యను మెపుడున్ 16

**జాంబవంతుడు**
భల్లూక జాతికి చెందినవాడు. రామ భక్తుడు రామరావణ యుద్ధంలో శ్రీరామునికి సహకరించాడు.

© SCERT not to be republished

**కవి పరిచయం**

కొఱవి గోపరాజు 15వ శతాబ్దానికి చెందినవాడు. "సింహాసన ద్వాత్రింశిక" అనే కథాకావ్యాన్ని రచించారు. ఇందులో పన్నెండు ఆశ్వాసాలు ఉన్నాయి. విక్రమార్కుని దివ్యసింహాసనానికి ఉన్న ముప్పయి రెండు సాలభంజికలు భోజరాజుకు చెప్పిన కథలు ఈ కావ్యంలో ఉన్నాయి.

ఈయన ఎనిమిది భాషల్లో పండితుడు. సాహిత్యంతోపాటు రాజనీతి, ఛందస్సు, యోగం, జ్యోతిష్యం మొదలైన 19 శాస్త్ర విషయాలలో ప్రవీణులు. చతుర్విధకవితావిశారదులు. అందరికీ సులభంగా అర్థమయ్యే రీతిలో కథలు చెప్పడం ఈయన ప్రత్యేకత.

**ప్రక్రియ - కథాకావ్యం**

వివిధ కథల సమాహారం కథాకావ్యం. ఇందులో వస్తు ప్రధానమై రమణీయ కథన శోభితమై, మనోరంజనంతో పాటు నీతిని, వ్యవహార దక్షతను, కార్య కుశలతను, ధర్మ ప్రబోధాన్ని, ఉత్తమ గుణాలను పెంపొందించే కథావళి ఉంటుంది.

**భావాలు :**

1. వేగంగా పరుగెత్తడం వల్ల గుఱ్ఱానికి బాగా చెమటపట్టింది. దాన్ని రాజకుమారుడు శుభ్రపరిచాడు. భయంకరమైన ఒక పెద్దపులి గుఱ్ఱం వాసన పసిగట్టి అక్కడికి వచ్చింది. అక్కడే ఉన్న రాజకుమారుణ్ణి చూసింది.
2. పులిని చూడగానే కట్టిన తాడును తెంచుకొని గుర్రం పరుగు తీసింది. పులిని చూసి భయపడి విజయపాలుడు పక్కనే ఉన్న చెట్టెక్కాడు.
3. పులి చెట్టు కిందికి వచ్చి నిలబడింది. అతడు చెట్టు ఎక్కగానే అక్కడ ఎలుగుబంటిని చూశాడు. దైవ ఘటనవల్ల తనకు ఇక్కడకూడా ప్రమాదం తప్పలేదు కదా! అనుకున్నాడు.
4. చెట్టుకింద పులి, పైన ఎలుగుబంటి; మధ్యలో ఉన్న రాజకుమారుని పరిస్థితి 'ముందు నుయ్యి వెనుక గొయ్యి' లాగా ఉంది.
5. పులి రెండు నిలువులెత్తు వరకు ఎగరగలదని, అక్కడ ఉండడం ప్రమాదమనీ, తనను నమ్మి వెంటనే తన దగ్గరకు రమ్మని ఎలుగు గట్టిగా అరచింది.
6. ఎలుగు పిలుపు విన్న రాజకుమారుడు చెట్టుపైకి వెళ్ళడమే తనకు క్షేమమని నిర్ణయించుకొని ఎలుగు దగ్గరకు వెళ్ళాడు. చెట్టుకింద ఉన్న పులి తనకిద్దరూ ఆహారంగా లభించారని అనుకొంటూ కళ్లలో నిప్పులుగక్కుతూ చెట్టుకిందే ఉంది.
7. ఎలుగుబంటి రాకుమారుణ్ణి చూసి అతనికి నిద్రవస్తే తన ఒడిలో నిద్రించమని భయంలేదని చెప్పింది. "నిద్రసుఖమెరుగదన్నట్లు" విజయపాలుడు దాని ఒడిలో నిద్రించాడు.
8. అప్పుడు పులి ఎలుగుబంటితో "నాతో శత్రుత్వం వహించి నీవు బతకగలవా? మనిద్దరం ఒకే గూటి వారం. వాడు మన శత్రువు. నిర్దయుడై అనేక జంతువులను చంపాడు. వాడి కోసం మనం పోరాడుకోవడం ఎందుకు? వాడిని కిందికి తోసెయ్యి. నిన్ను విడిచి పెట్టడమేగాక వాడి మాంసంలో సగమిస్తాను. మనిషిని ఎప్పుడూ నమ్మకూడదు. అలా నమ్మి వెనకటికొక పాము అగ్నిలో పడి చచ్చిపోయిందికదా!" అని అన్నది.
9. గోదానం, ధనదానం, భూదానం, అన్నదానం, జలదానం, విద్యాదానం ఈ అన్ని దానాలకంటె అభయదానం గొప్పది.
10. శరణన్న వాణ్ణి, తనను నమ్మిన వాణ్ణి, చంపితే శిశుహత్యా పాతకం చుట్టుకొంటుంది. ప్రతిజ్ఞా పాలనం తెలిసిన జాంబవంతుని వంశానికి చెందిన వాళ్ళం. కాబట్టి ఆడినమాట తప్పనని, అనవసరపు ఆశ వదులుకోమని ఎలుగు చెప్పింది.
11. ఈ విధంగా ఎలుగు చెప్తుండగా రాజకుమారుడు నిద్రలేచాడు. అప్పుడు ఎలుగు తాను నిద్రపోతానని, అతనిని మెలకువగా ఉండమని తొడ మీద ఒరిగింది. అది గమనించి పులి వాడు భయకంపితుడయ్యేటట్లు పలికింది.
12. కోరలున్న వాటిని, గోళ్ళున్న వాటిని, కొమ్ములున్న వాటిని నమ్మకూడదు. ఎందుకంటే అవి తిరగబడితే బతకలేం. కాబట్టి ఎలుగుతో స్నేహం తగదని చెప్పింది.
13. ఆరునెలలైనా, ఏడాదైనా చంపందే వదలనని అతను బతకాలంటే ఎలుగును కిందికి తోసెయ్యాలని పులి భయపెట్టింది.
14. అదే నిజమనుకుని రాకుమారుడు ఎలుగును కిందికి తోశాడు. అది జారిపడుతూ హఠాత్తుగా మేల్కొని చేతికి దొరికిన కొమ్మను పట్టుకొని మళ్లీ పైకెక్కి భయపడుతున్న రాకుమారుడితో తనవల్ల ప్రమాదం లేదని అభయమిచ్చింది.
15. అది గమనించిన పులి నిరాశతో తనగుహకు వెళ్ళిపోయింది. సూర్యోదయం కాగానే ఎలుగుబంటి, విజయపాలుడు కిందికి దిగారు.
16. అప్పుడు ఎలుగుబంటి అతణ్ణి పిలిచి అన్యాయంగా ప్రవర్తించావు. అయినా దానివల్ల కలిగే నరకలోక బాధ లేకుండా చేస్తాను. ఇకపై 'ససేమిరా' అంటూ బతకమని శపించింది.

## ఇవి చేయండి

### I. అవగాహన - ప్రతిస్పందన

**అ) కింది అంశాల ఆధారంగా మాట్లాడండి.**

1. 'మనిషినెప్పుడు నమ్మకూడదు' అనే పులిమాటలు నిజమా! కాదా! ఎందుకు? వ్యాఖ్యానించండి.
2. కింది అంశాల్లో ఏదైనా ఒక అంశాన్ని సమర్థిస్తూ చర్చలో పాల్గొనండి.

   i. అన్నదానం ii. విద్యాదానం, iii. అవయవదానం.

**ఆ) కింది వాక్యాల ఆధారంగా పద్య పాదాలు గుర్తించి రాయండి.**

1. ఎలుగుబంటి గొంతెత్తి బిగ్గరగా పిలిచింది.
2. మనిషిని నమ్మవద్దు; అలా నమ్మి ఒక పాము మంటలో పడి చచ్చింది.
3. ఎలుగుబంటితో నీకు స్నేహమెందుకు?

**ఇ) పాఠ్య భాగాన్ని చదివి కింది వాటికి సమాధానాలు రాయండి.**

1. పులి తన సమీపంలో గుర్రం ఉందని ఎలా పసిగట్టింది?
2. చెట్టు మీదికి ఎక్కిన రాజకుమారుడు తనకు ఇక్కడ కూడా ప్రమాదం తప్పడం లేదని ఎందుకనుకున్నాడు?
3. ఆడిన మాటను తప్పను అని ఎలుగుబంటి ఎందుకు చెప్పింది?
4. 'ససేమిరా' అంటూ తిరగాల్సిందిగా ఎలుగుబంటి ఎందుకు శపించింది?

### II. వ్యక్తీకరణ - సృజనాత్మకత


**అ) కింది ప్రశ్నలకు ఐదు వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

1. 'నిద్ర సుఖమెరుగదు' ఎటువంటి సందర్భాలలో ఈ మాట వర్తిస్తుందో రాయండి.
2. 'ఒకే గూటి పిల్లలమని' పులి అన్నది అంటే అర్థమేమిటి? వివరించండి.
3. "అన్ని దానాలకన్నా అభయదానం గొప్పది" అనడానికి రెండు ఉదాహరణలు రాయండి.
4. మీకు తెలిసిన "ఆడిన మాట తప్పని" వ్యక్తుల గురించి రాయండి.
5. స్వాతంత్ర్య దినోత్సవం రోజు విద్యార్థులు ఎలుగెత్తి నినాదాలు చేస్తారు కదా! ఇంకా ఎక్కడెక్కడ ఎలుగెత్తి నినాదాలు చేస్తారు?

**ఆ) ఈ కింది వాటికి పదిహేను వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

1. పాఠ్యభాగ సారాంశాన్ని మీ సొంతమాటల్లో రాయండి.
2. భూదానం, విద్యాదానం, అన్నదానం ఏదైనా ఒక అంశాన్ని వివరిస్తూ రాయండి.
3. పులి, ఎలుగుబంటి పాత్రల స్వభావాలను విశ్లేషిస్తూ మీ అభిప్రాయాలు రాయండి.

© SCERT not to be republished



**ఇ) సృజనాత్మకంగా రాయండి.**

పాఠ్యభాగకథను సంభాషణ రూపంలోకి మార్చండి.

లేదా

పాఠ్యాంశంలోని పులి, ఎలుగుబంటి, రాకుమారుడు పాత్రలతో ఏకాంకిక రాయండి.

**ఈ) ప్రశంసాత్మకంగా రాయండి.**

పాఠంలో అన్నదానం, భూదానం, విద్యాదానం వంటి దానాలకంటే అభయదానం గొప్పదని ఉంది కదా! అయితే విద్యాదానానికి సంబంధించిన కింది సన్నివేశాన్ని చదవండి.

**విజయలక్ష్మి అనే విద్యార్థి కష్టపడి చదివి మెడిసిన్‌లో సీటు సంపాదించింది. కాలేజీలో చేరడానికి ఆర్థిక స్తోమత లేదు. ఒక దాత ఇచ్చిన విరాళంతో మెడికల్ కాలేజీలో చేరింది. అతడు చేసిన మేలును దినచర్యలో రాసుకుంది.**

విజయలక్ష్మి స్థానంలో మీరుంటే ఎలా కృతజ్ఞత తెలిపేవారో మీ దినచర్య పుస్తకంలో రాయండి.

## III. భాషాంశాలు

### పదజాలం

**అ) కింది వాక్యాల్లో గీత గీసిన పదాన్ని ఉపయోగించి మరో సొంత వాక్యం రాయండి.**

1. స్వాతంత్ర్యం నా జన్మహక్కని తిలక్ ఎలుగెత్తి చాటాడు.
2. విహారయాత్రకు వెళ్ళిన విద్యార్థులు అలసట చెంది నిద్ర సుఖ మెరుగదన్నట్లు నేలపై పడుకున్నారు.
3. ఉన్న ఊళ్ళో ఉపాధి లేదనుకొని కొంతమంది బతుకుదెరువు కోసం వలస పోతారు.
4. పంతం పట్టి కృషిచేస్తే దేన్నైనా సాధించగలం.

**ఆ) కింది వాక్యాల్లో భావాన్ని బట్టి గీతగీసిన పదానికి గల వేరు వేరు అర్థాలను గుర్తించి రాయండి.**

1. అడవిలో పుండరీకం గాండ్రిస్తూ చిన్నజంతువులను భయపెడుతుంది.
   సూర్యరశ్మి సోకగానే సరస్సులో పుండరీకం వికసిస్తుంది.
   పుండరీకం ;............................;.....................
2. చెట్ల శాఖలపై పక్షులు గూళ్ళు కట్టుకుంటాయి.
   బ్యాంకులు వివిధ నగరాలలో తమ శాఖల ద్వారా ప్రజలకు సేవలు అందిస్తున్నాయి.
   శాఖలు;............................;.....................
3. పోస్ట్‌మెన్ అందరికీ ఉత్తరాలు తెచ్చిస్తాడు.
   ఉపాధ్యాయుడు అడిగే ప్రశ్నలకు విద్యార్థులు ఉత్తరం ఇస్తారు.
   ఉత్తరం;............................;.....................
4. విజయనగర సామ్రాజ్యాన్ని శ్రీకృష్ణదేవరాయలు అనే రాజు పరిపాలించాడు.
   పున్నమినాడు ఆకాశంలో రాజు వెన్నెల కురిపిస్తాడు.
   రాజు; ............................;.....................

©SCERT not to be published

ఇ) కింది పదబంధాలు ఏ సందర్భంలో వాడతారో వివరించండి.

1. నిద్ర సుఖమెరుగదు.

2. ముందు నుయ్యి వెనుక గొయ్యి.

ఈ) కింది పట్టికలోని వాక్యాలకు సంబంధించిన వ్యుత్పత్తి పదాలను రాయండి.

వ్యుత్పత్తి పదాలు : పుత్రుడు, నృపుడు, వనచరం, పథికుడు, వనజము, నిశాచరుడు.

| | | |
|---|---|---|
| 1. | వనము నందు సంచరించునది | |
| 2. | నరులను పాలించువాడు | |
| 3. | పున్నామ నరకం నుండి రక్షించేవాడు | |
| 4. | పథము నందు వెళ్ళువాడు | |

## వ్యాకరణం

అ) కింది సంధులకు సంబంధించిన ఉదాహరణలను పాఠంలో వెతికి రాయండి. సూత్రాలు కూడా రాయండి.

1. టుగాగమ సంధి 2. జశ్త్వసంధి 3. గసడదవాదేశసంధి 4. ఇత్వసంధి 5. యడాగమసంధి.

ఆ) త్రిక సంధి

ఆ,ఈ,ఏ లను త్రికం అంటారు.

కింది ఉదాహరణ చూడండి.

అక్కొమరుండు = ఆ + కొమరుండు;

ఆ + కొమరుండు అనే దాంట్లో "ఆ" 'త్రికం' లో ఒకటి. ఇది 'అ' గా మారింది. సంయుక్తాక్షరం కాని హల్లు (కొ) ద్విత్వంగా ('కొ' 'క్కొ'గా మారింది.)

అలాగే 'ఈ,ఏ' లనే త్రికములు కూడా ఇ, ఎ లుగా మారుతాయి.

సూత్రం : త్రికం మీది అసంయుక్త హల్లుకు ద్విత్వం బహుళంగా వస్తుంది.
సంయుక్తాక్షరం కాని హల్లు ద్విత్వాక్షరంగా మారుతుంది.

కింది పదాలను విడదీసి రాయండి.

ఇచ్చోట : ___________ అక్కడ : ___________ ఎక్కడ : ___________

ఇ) పాఠంలోని సమాస పదాల ఆధారంగా కింది పట్టికలోని ఖాళీ గళ్ళను పూరించండి.

| | సమాసం | విగ్రహవాక్యం | సమాసంపేరు |
|---|---|---|---|
| 1. | రాజకుమారుడు | | |
| 2. | | | రూపక సమాసం |
| 3. | నృపవ్యాఘ్రుడు | | |
| 4. | | భీమాకారమైన ఆకృతి | |
| 5. | | | ద్విగు సమాసం |
| 6. | అన్నదానము | | |
| 7. | | దయకానిది | |
| 8. | | | షష్ఠీ తత్పురుష సమాసం |

© SCERT not to be republished

### ఈ) బహువ్రీహి సమాసం

కింది ఉదాహరణను గమనించండి.

చక్రపాణి – చక్రం పాణియందు (చేతిలో) కలవాడు – విష్ణువు అని అర్థం. దీంట్లో సమాసం లోని రెండు పదాలకు (చక్రానికి గాని పాణికి గాని) ప్రాధాన్యం లేకుండా ఆ రెండూ మరో అర్థం ద్వారా విష్ణువును సూచిస్తున్నాయి. ఇలా సమాసంలోఉన్న పదాల అర్థానికి ప్రాధాన్యం లేకుండా అన్యపద అర్థాన్ని స్ఫురింపజేస్తే దాన్ని బహువ్రీహి సమాసం అంటారు. అన్యపదార్థ ప్రాధాన్యం కలది బహువ్రీహి సమాసం.

**కింది పదాలకు విగ్రహవాక్యాలు రాయండి.**

1. నీలవేణి 2. నీలాంబరి 3. ముక్కంటి

4. గరుడవాహనుడు 5. దయాంతరంగుడు 6. చతుర్ముఖుడు

### (ఉ) ఛందస్సు : కింది పద్య పాదాలకు గణవిభజన చేసి లక్షణాలు రాయండి.

1. 'శీఘ్రపాత నితాంతతాంత తురగ స్వేదంబు దీర్పంగ హ్ప(ష్ఠ)'

పద్యం : __________, యతి స్థానం : __________, ప్రాస : __________

గణాలు : ____________________________________________

2. 'అనుచు నిరుత్తరంబుగ దయామతిc బల్కెడు నంత రాజనం'

పద్యం : __________, యతి స్థానం : __________, ప్రాస : __________

గణాలు : ____________________________________________

### ఊ) అలంకారాలు

7వ పద్యంలోని అలంకారాన్ని కనుగొని, పేరు రాసి, లక్షణాలతో సరిపోల్చండి.

### ఋ) స్వభావోక్తి

శీఘ్రపాత నితాంతతాంత ......... చూచుడున్ (పద్యంలో)

"గుర్రాన్ని చూసిన పులి మీసాలు నిక్కరించడం, మోరయెత్తి గుర్రాన్ని వాసన పసిగట్టడం, పొదలోదాగడం మొదలైన వర్ణన పులి స్వభావానికి తగినట్లుగా ఉన్నది" గనుక ఇది స్వభావోక్తి అలంకారం. ఇలా ఏదైనా విషయాన్ని ఉన్నది ఉన్నట్లుగా వర్ణిస్తే దాన్ని స్వభావోక్తి అలంకారం అంటారు.

ఉదా : – జింకలు బిత్తర చూపులు చూస్తూ చెవులు నిగిడ్చి చెంగు చెంగున గెంతుతున్నాయి.

స్వభావోక్తి అలంకారానికి రెండు ఉదాహరణలు రాయండి.

© SCERT not to be republished

## ఇదీ చదవండి

వేటకు వెళ్ళిన విజయపాలుడు తిరిగి రాలేదు. గుర్రంమాత్రం ఇంటికి ఒంటిగా వచ్చింది. రాజు తన కుమారుడి కోసం అడవిలో వెతుకుతూ బాలుణ్ణి చూశాడు. 'ససేమిరా' అనే మాటను వదలకుండా పలుకుతున్న అతణ్ణి ఇంటికి తీసుకెళ్ళి వైద్యం చేయించాడు. వీడికి పట్టిన భూతాన్ని విడిపించే వారికి అర్థరాజ్యమిస్తానని ప్రకటించాడు. పూజలు చేయించాడు. అయినా అతడు ఆ నాలుగక్షరాలు విడవడం లేదు. అప్పుడు మంత్రి సలహా మేరకు ఆ పట్టణంలోని ఒక గురువు వద్దకు తీసికెళ్ళాడు. గురువు అతడి నుండి 'ససేమిరా' ధ్వనిని విన్నాడు.

గురువు అతణ్ణి ఉద్దేశించి కింది పద్యాలు చదివాడు ఆ పద్యాలు ఇవి.

'స'జ్జనభావము గలుగు సు<br>
హృజ్జనముల మోసపుచ్చు టది నేరుపె నీ<br>
యజ్జ తొడమీదc గుర్కి న<br>
యజ్జంతువుc జంపcజూచు టది పౌరుషమే?

పద్యం వినగానే మొదటిఅక్షరమును విడిచి 'సేమిరా' అని అంటున్నాడు.

'సే'తువుcగని జలనిధిసం<br>
జాత ధనుష్కోటిcబడిన సద్విజహతికిం<br>
బాతకము వాయు మిత్రవి<br>
ఘాతికిc బాతకమె కాని గతి గలుగదనా?

రెండవ పద్యం చదవగానే రెండవఅక్షరం విడిచి 'మిరా' అన్నాడు.

'మి'త్ర'ద్రోహి కృతఘ్న ప<br>
విత్ర గురుద్రోహి చౌర్య విద్యాపరులున్<br>
మిత్రశశిస్థితి మేరగc<br>
బుత్రులు గలిగియును నరకమునc బడుదురనా?

మూడవ పద్యం వినగానే మూడవఅక్షరం విడిచి 'రా' అని అన్నాడు.

'రా'జ భవదీయుడైన త<br>
నూజునకు న్శుభము నోజ నూల్కొను విద్య<br>
ద్రాజికి ధనదానము ని<br>
ర్వ్యాజమునం జేయు మిహపరంబులు గలుగున్

అని, పద్యం చెప్పగానే బాలుడు నాల్గవ అక్షరం విడిచి పూర్వస్థితికి చేరాడు.

### ప్రాజెక్టు పని

పాఠంలోని పద్యభావాలకు సరిపోయే నినాదాలను, సామెతలను సేకరించి పట్టిక తయారుచేసి ప్రదర్శించండి.

లేదా

మీకు తెలిసిన జంతువులు లేదా మానవులకు ఎలా ఉపయోగపడతాయో రాసి ప్రదర్శించండి.

**ఎవరిబుద్ధి ఆపదల్లో కూడా పతనంకాదో, అటువంటివాళ్ళే ఆపదల నుండి సునాయాసంగా బయటపడతారు.**
**- పంచతంత్రం.**

© SCERT not to be republished